సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం । 15 । జనవరి । 2024



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భోగి సంబరాలు









చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న మహిళ



సిరిసిల్లలో ముగ్గు వేస్తున్న చిన్నారి, గంగిరెద్దులవారి సందడి



భోగి కళ.. మిన్నంటిన వేళ

సిరిసిల్లకు సంక్రాంతి శోభ

- వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు
- పతంగులతో సందడి చేసిన చిన్నారులు, యువత
- జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటిన సంబరాలు

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రం సిరిసిల్ల పట్టణం ఒకరోజు ముందే సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రజలు భోగి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భోగి మంటలను రగిలించి ఆటపాటలతో వేడుకలు చేసుకున్నారు. యువత, చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. గంగిరెద్దులవారు, హరిదాసులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. చిన్నపిల్లలకు బోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. సిరిసిల్ల మార్కెట్‌లో ముగ్గుల పిండి, రంగులు, గొబ్బెమ్మలకు కావాల్సిన ఆవుపేడ, పిండికూర, రేణగాయలు, పండ్లు, ఫలాల అమ్మకాలతో సందడి నెలకొంది. పండుగ నేపథ్యంలో అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుపగా.. ఇష్ట దైవాలకు మొక్కులు సమర్పించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



వేములవాడలో ముగ్గువేస్తున్న యువతి



జిల్లా కేంద్రంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, చిన్నారులు



డూడూ బసవన్నతో గంగిరెద్దులవారి సందడి



జిల్లా కేంద్రంలో..

న్యూస్‌రీల్

రాజన్న సేవలో మంత్రి, విప్



వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ ఈవో కృష్ణప్రసాద్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభకలశతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రాహ్మణోత్తములచే స్వామివారి ప్రసాదం అందజేసి సత్కరించారు.

19న బ్యాంకింగ్ ఉద్యోగాలకు జాబ్‌మేళా

సిరిసిల్లకల్చరల్: ప్రముఖ కార్పొరేట్ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు టైమ్స్‌ప్రొ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ విజయ్ ప్రకటనలో తెలిపారు. స్థానిక వాసవీనగర్‌లోని మహతి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించే మేళాలో డిగ్రీ ఉత్తీర్ణులైన పాతికేళ్ల లోపు యువతీ, యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, యునిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో ఖాళీలను ఈ మేళా ద్వారా భర్తీ చేస్తామన్నారు. రెండు దశల్లో స్క్రీనింగ్ పూర్తయ్యాక ఎంపికైన అభ్యర్థులకు తగిన శిక్షణ, అనంతరం నియామకాలు పూర్తి చేస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.2.5లక్షల కనీస వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత ధృవపత్రాలతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు తీసుకురావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 98855 35991 సెల్ నంబర్‌లో సంప్రదించి తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

సంతోషం నింపాలి



వేములవాడ: సంక్రాంత్రి పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలి. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలి. నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు.

– కుటుంబ సభ్యులతో విప్ ఆది శ్రీనివాస్

సెల్ మాయ.. పల్లె పరాయి!

- సెల్‌ఫోన్ మాయలో పల్లెప్రజలు
- కనిపించని అరుగులపై ముచ్చట్లు
- కనుమరుగైన రచ్చబండ పంచాయితీలు
- సెల్‌ఫోన్‌లోనే అనుబంధాలు
- పల్లెల్లో కనిపించని సం'క్రాంతి'

ఏడుకొండల.. వెంకటరమణ
తిరుపతికొండలు.. తిరిగినవాడ
తిరుమనిరేకులు.. దిద్దినవాడ
హరిలో రంగ హరి..

అయ్యవారికి దండంపెట్టు
అమ్మవారికి దండంపెట్టు
పిల్లపాపలు సల్లంగుండని
గొడ్డుగోదలు సంపదనివ్వని
పెట్టరా బసవన్న దండంబెట్టు



'సెల్' ఫోన్‌లో మునిగిన యువకులు

సిరిసిల్ల: ఈ పాటలు.. ఆ మాటలు.. పల్లెతల్లి ఒడిలో లీలగా వినిపిస్తున్నాయి. పాడేది హరిదాసు. మాట్లాడేది గంగిరెద్దాయన. పట్టణాలకు చదువుల కోసం, కొలువుల కోసం వెళ్లిన వాళ్లు పల్లెకు చేరారు. కానీ మనసు విప్పి మాట్లాడుకునుడే లేదు. సెల్‌ఫోన్ చేతికొచ్చాక ప్రపంచాన్ని అరచేతిలోనే చూస్తుండ్రు. పక్కింటి వాళ్లతో మాట్లాడే సమయం లేదు. ఆనాటి ఆప్యాయతలు లేవు. అనురాగాలు కానరావు. పండగ వచ్చిందంటే నాకు ఎంతో సంబురం. ఎక్కడెక్కడో ఉండే నా వాళ్లంతా నా దరికి చేరుతారు. వాళ్లను చూస్తుంటే నా కడుపు నిండిపోతుంది. నా ఒడిలో బతికే వాళ్లకు ఒకప్పుడు చేతినిండా పని. ఇంటి నిండా ధాన్యం. ఊరు సుట్టూ వాగులు, కాలువలు. తుకాలు పోసి.. పొలాలు దున్నతూ.. నాట్లు వేస్తూ.. ఉషారుగా ఉండే వారు. బోగి మంటలు.. భోగభాగ్యాలతో కళకళలాడే పల్లెల్లో మునుపటి సందడి కనుమరుగైంది.

ముచ్చట్లు మరిచిపోయింండ్రు

పల్లెలకు చేరిన పట్నమోళ్లు సెల్‌ఫోన్లతోనే ఆడవట్టిరి. నాటి ముచ్చట్లు లేవు.. మంచీ చెడు అర్సుకునే ధ్యాసే లేదు. వాట్సాప్‌లలో మెస్సేజ్‌లు.. ఫేస్‌బుక్కుల్లోనే పలకరింపులు. సంక్రాంతికి చలి సంకలెత్తనిత్తలేదు. ఒకప్పుడు గంద్రపేగులు కట్టుకొని, గొంగడిబొంతలు సుట్టుకుని గజగజ వణుక్కుంట నాగండ్లు కడుదురు. మరీ ఇప్పుడు కాలం మారింది. అన్ని పనులు ట్రాక్టరే చేస్తుంది. మాగికాలం నాట్ల పనికిపోతే మంచి కూలి వస్తుంది. కానీ పైసలకు లెక్కలేదు, మనుషులకు విలువ లేదు.

గంగిరెద్దుల ఆటలేవి.. హరిదాసులు ఏమైరి

ఒకప్పుడు సంకురాత్రి అంటేనే గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల పాటలు. ఇంటింటికీ తిరిగి ధాన్యమడుక్కుందురు. మరీ గిప్పుడు వాళ్ల తిరుగుడు లేదు.. మనం పెట్టుల్లేదు. ఒకప్పుడైతే కాలుపెట్ట సందులేకుండా ఇంటినిండ ధాన్యం ఉండేది. గొబ్బెమ్మలు చేసే పెండ నుంచి అరిసెలు చేసే బెల్లం దాకా అన్నీ కొనుడేనాయె. ఇక నవధాన్యాలు, రేగుపండ్లు.. జీడిపండ్లంటరా.. అవి ఎన్నడో దేవునికి ముట్టినయి. కడపల మీద పిజ్జాలు.. బర్గర్లు పెట్టే కాలమొచ్చింది.

సకినాలు ఎటుపాయే

సంకురాత్రి అనంగనే సకినాలు గుర్తుకొత్తయి. కుంచెడు బియ్యం నానబోసి దంచి.. తవ్వెడు నువ్వులు.. చారెడు ఓమ గలిపి సకినాలు వొత్తే నెల్లాల్ల గానమైతుండే. గారప్పులు.. అరిసెలు.. మురుకులు.. ఎన్నెన్ని పిండివంటలో. పల్లీలు.. నువ్వులు.. బబ్బెర్లు.. పెసర్లు.. అన్ని మన పొలంల పండినయే. మరిప్పుడు చేసుడు బందాయే.. ఆన్‌లైన్ బుకింగ్‌లాయే.

అంతా మాయలాగే..

పొద్దు పొడిసినా పొగమంచు పోకపోతుండే. చలిమంటలు ఏసుకుని పడుసు పోరగాండ్లు, నడివయసోళ్లు.. ముసలోళ్లు కూసుందురు. ఊరు ముచ్చట్లు పెడుదురు. కోడిపుంజు కోసుకుని వాసన బియ్యంతో బిర్యానేసుకుంటే కమ్మటి వాసన. ఇప్పుడు పారంకోడి కూర రుచి లేదు.. వాసన అసలే లేదు. వానాకాలం పోయింది. సలికాలం.. ఎండ కాలమాయె. ఊరు పచ్చదనాన్ని కోల్పోయే. నా పొలిమేరలోకి సెల్‌టవర్లు వచ్చి మనుషులను దూరం చేసే. పండగన్న మాటే కానీ.. రైతు ముఖంల ఆ నవ్వేలేదు. రైతు సల్లంగుంటే సబ్బండ వర్ణాలకు పనుంటుండే. కులవృత్తి నమ్ముకున్నోళ్ల నుంచి గంగిరెద్దు, హరిదాసు వరకు అందరికీ గాసం దొరికేది. ఇప్పుడు అందరూ ఒకే చోట ఉన్నా మనసువిప్పి మాట్లాడుకునుడు లేదు. అంతా సెల్‌ఫోన్ మాయ. నా మనసులోని బాధను చెప్పిన. పండుగ పూట నా వేదన విన్నందుకు అందరికీ వందనాలు. ఇగ ఉంట బిడ్డ. బంగారు కాలం బోయింది.. బంగారమసోంటి మనుషులు పోయిండ్రు.. ఇంక రానురాను ఎంతగతికుందో..

ఇట్లు మీ అందరి క్షేమం కోరే పల్లెతల్లి



జిల్లాలోని ఓ పల్లె



పల్లె ఒడిలో సెల్ ఫోన్ టవర్లు

నిజాయితీకి గుర్తింపు




బొల్లం శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, కవులు, పాత్రికేయులు


- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్
- సీఎం పీఆర్వో బొల్లం శ్రీనివాస్‌కు స్వగ్రామంలో ఆత్మీయ సన్మానం



మాట్లాడుతున్న నలిమెల భాస్కర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సమాజ సంక్షేమానికి నిజాయితీగా పనిచేసేవారికి ఏ రంగంలోనైనా గుర్తింపు ఉంటుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌కు చెందిన బొల్లం శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డి పీఆర్వోగా నియమితులై మొదటిసారి ఆదివారం స్వగ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ముందుగా శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నలిమెల భాస్కర్ మాట్లాడుతూ.. నా రాయణపూర్ గ్రామం కవులు, కళాకారులు, విద్యావేత్తలు, ఉద్యోగులకు పుట్టినిల్లని అన్నారు. ఈ మట్టిలో పుట్టిన ప్రతీ బిడ్డ ఏదో ఒక రంగంలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు ఉన్నత స్థానాలు సాధించినవారు ఉండగా.. ప్రస్తుతం సీఎం పీఆర్వోగా శ్రీనివాస్ నియామకం కావడంతో గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. బొల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ.. జర్నలిజం కత్తిమీద సాములాంటిదని, ఈ వృత్తిలో ఎన్ని కష్టాలు ఉంటాయో.. అంత ఎంజాయ్ చేయవచ్చన్నారు. కలుషితం కాకుండా వృత్తినే దైవంగా భావించి, పనిచేసే వారికి అనేక అవకాశాలు వస్తాయని తెలిపారు. సీఎం పీఆర్వో ఊహించని అవకాశమని, దీన్ని సమాజ మంచి కోసం వినియోగిస్తానన్నారు. పుట్టిగడ్డ రుణం తీర్చుకోవడానికి వైద్యం, అభివృద్ధిపరంగా తన సాయశక్తులా కృషి చేస్తానన్నారు. మండల విలేకరి నుంచి సీఎం పీఆర్వోగా ఎదిగిన క్రమంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని, కుటుంబానికి సైతం సమయం కేటాయించకుండా నిబద్ధతతో పని చేశానని తెలిపారు. ఆ కష్టానికి ప్రతిఫలమే ఈ అవకాశమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, డీపీఆర్వో మామిండ్ల దశరథం, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ గోపాల్, సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అఫేరా సుల్తానా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, డీఎస్‌వో పాముల దేవయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.





కల్యాణ వైభోగమే..

సిరిసిల్లటౌన్: శ్రీశాల క్షేత్రం పులకించింది. గోదారంగనాథుల సేవలో భక్తజన కోటి తరించారు. మాడవీధుల్లో హరి నామస్మరణం హోరెత్తింది. నెల రోజులుగా జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదాదేవి రంగనాథుల కల్యాణ మహోత్సవం సిరిసిల్ల వెంకన్న క్షేత్రంలో రమణీయంగా జరిగింది. వేదమంత్రాలు.. బాజాభజంత్రీల నడుమ కల్యాణ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకస్వాములు కల్యాణోత్సవాన్ని శాస్త్రోతికంగా జరిపించగా..భక్తులు పారవశ్యంలో తేలియాడారు. ముత్తైదువులు గోదామాతకు ఒడిబియ్యం సమర్పించారు. అర్చకులు, కృష్ణమాచారి, రామాచారి వేడుకలను నిర్వహించారు. అనంతరం సుమారు రెండువేల మందికి అన్నదానం నిర్వహించారు. ఆలయ ఈవో మారుతిరావు, ఏఈవోలు ప్రభాకర్, రవీందర్, ఆలయకమిటీ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, తీగల శేఖర్‌గౌడ్, చేపూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన మల్లయ్య

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్, సిద్దిపేట ప్రధాన రహదారిపై బందనకల్ స్టేజీ వద్ద కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాలిలా ప్రకారం.. సిద్దిపేట జిల్లా బంజేరుపల్లి మాటిండ్లకు చెందిన దొండడి మల్లయ్య ఆదివారం బందనకల్ స్టేజీ నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్యకు గాయాలు కాగా ముస్తాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ చిన్ని అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆకర్షణ సతీశ్‌కు మారసం పుస్తకాల వితరణ



సిరిసిల్లకల్చరల్: ఏడో తరగతి చదువుతున్న వయసులోనే 9 గ్రంథాలయాలను నెలకొల్పి రాష్ట్రపతి, ప్రధానమంత్రి ప్రశంసలు అందుకున్న ఆకర్షణ సతీశ్‌కు పట్టణంలోని మానేరు రచయితల సంఘం వెయ్యి పుస్తకాలను బహూకరించింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న ఆమె లైబ్రరీల స్థాపనతో పఠనాసక్తి పెంచుతోంది. ఆమెకు ప్రోత్సాహకంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మారసం తన వంతుగా బాల సాహిత్యానికి సంబంధించిన వెయ్యి పుస్తకాలను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బాల సాహిత్య పరిషత్ ప్రతినిధి చొక్కాపు వెంకటరమణ, దక్కన్ సాహిత్య సభ అబ్దుల్ ఘనీ, మారసం అధ్యక్షుడు ఎలగొండ రవి తదితరులు పాల్గొన్నారు.

పందెం కోడి

- చిన్నప్పటి నుంచే ఖరీదైన తిండి
- ప్రత్యేక దృష్టి.. స్పెషల్ ట్రైనింగ్

“సాక్షి, కరీంనగర్ డెస్క్: సంక్రాంతి తెలుగింట పెద్దపండుగ. భోగింటలు.. ముగ్గులు.. పిండివంటలు.. పతంగులే కాదు.. కోడి పందాలు ఓ భాగమే. పందెం కోళ్లను పెంచడానికి చాలాజాగ్రత్తలు తీసుకుంటారు. ఆ కోళ్లను సొంత బిడ్డల్లా పెంచుతారు. ఈత నేర్పడం.. వేడినీళ్ల స్నానం.. బాదం.. పిస్తా పప్పులు.. కోడిగుడ్డు సొన.. మధ్యాహ్నం భోజనంలో ఉడికించిన వేట మాంసం.. కీమా లడ్డూలు.. డిన్నర్ తర్వాత ఖరీదైన బి–కాంప్లెక్స్ గోలీలు.. దాహం వస్తే మినరల్ వాటర్ ఇస్తారు. సంక్రాంతి మూడు రోజులే.. కానీ.. పందెపు కోళ్లకు మూడు నెలల ముందు నుంచే పండుగ. అసలు సిసలు పందెం పుంజులకోసం. పోరాడే సత్తా ఉన్న కోడిపెట్టతో మరో కోడిపుంజును జతచేసి ఓకచోట ఉంచుతారు. నెల రోజుల తర్వాత ఆ గుడ్లను పొదిగిస్తారు. వాటిలో మంచి లక్షణాలున్న పుంజు పిల్లను ఎంపిక చేసి ఏడాదిపాటు అత్యంత శ్రద్ధతో పెంచుతారు.”

పోషకాల తిండి..

రోజువారీ అయితే చోళ్లు, రాగులు, గంట్లు వంటి అపరాలే. స్పెషల్ ఫుడ్ అంటే బాదం, కోడిగడ్డులోని తెల్లసొన. పందాలకు 15 రోజుల ముందు నుంచి రోజూ ఉడికించిన మాంసపు విందు. అదనంగా బి–కాంప్లెక్స్ గోలీలు.







చిన్నప్పటి నుంచే శిక్షణ..

ఉదయాన్నే కాలువలు.. చెరువుల్లో ఈత. ఎండలో సుమారు రెండుగంటపాటు ఆరనివ్వడం. ఆయాసం వచ్చి పడిపోతే కఫం బయటకు వచ్చేలా నోట్లో నీరు పోసి సొంగకొట్టడం. నిత్యం మసాజ్ సదుపాయం కూడా.. ఆరోగ్యంగా ఉండేందుకు, బద్దకం వీడేందుకు ఉదయాన్నే ఆవిరి పట్టడం. దోమలు కుట్టకుండా ఫ్యాన్ల ఏర్పాటు ఉంటుంది.



- **పుంజు ఖరీదు లక్షల్లోనే..**

సాధారణ పందెపు కోడి రూ. 10 నుంచి 20 వేల వరకు ఉంటే.. జాతికోళ్ల ధర రూ.25 వేల నుంచి 50 వేల వరకు ఉంటుంది. ఒకటిరెండు పందాల్లో గెలిచిన చరిత్ర ఉండే పుంజులు లక్ష కూడా పలుకుతాయి. ఒక్కో పుంజుకు దాని జాతిని బట్టి నెలకు రూ.3 నుంచి రూ.5 వేల వరకు తిండికి ఖర్చు చేస్తారు. ఇందుకోసం ప్రత్యేక అనుభవం ఉన్న జీతగాళ్లు ఉంటారు.

- **స్పెషల్ ట్రైనర్లు...**

కోళ్లకు తర్ఫీదు ఇచ్చేందుకు కోల్‌కతా నుంచి స్పెషల్ ట్రైనర్లు ఉంటారు. పండుగకు 15 రోజుల ముందు రంగంలోకి దిగుతారు. ఉభయ గోదావరి జిల్లాలకే ఈ తరహా స్పెషల్ కోచ్‌లు సుమారు వంద నుంచి రెండు వందల మంది వస్తుంటారు.

- **కోడి ఎంపిక శాస్త్రబద్ధం..**

ఏ రాశిలో ఏ జాతి పుంజు పందెం కొడుతుండో తెలుసుకోవడానికి కుక్కుట శాస్త్రాలు అనుసరిస్తారు. కాకి, డేగ, నెమలి, తీతువ, పర్ల, పెట్టమారు, పింగ్ల, పచ్చకాకి, అబ్రాస్, రసంగి, పువ్వల, కొక్కిరాయి వంటి వాటిని ఒకదానిపై ఒకటి ఎత్తుగడగా ఎంచుకొని బరిలోకి దించుతారు. బరిలో దిగిన పుంజుల రంగుల్ని బట్టి గెలుపోటములను అంచనా వేసి పందాలు కాస్తారు.

- **సీక్రెట్ ఇదీ..**

పుంజుల వంశావళి వివరాలు ఎంతో రహస్యం. బయటకు పొక్కితే అంతకన్నా మేలు రకం పుంజులను ప్రత్యర్థులు బరిలోకి దించుతారు. పందాలు ముగిసేవరకు పుంజులకు బ్రహ్మచర్య వ్రతం తప్పదు. తదనుగుణంగా వాటి యజమానులు జాగ్రత్తలు తీసుకుంటారు.

- **కత్తుల సమరం..**

కోస్తా జిల్లాల్లో రెండు రకాల పందాలు జరుగుతాయి. చూపుడు పందాల్లో అక్కడికి వచ్చిన పందెంరాళయుళ్లు తమతమ పుంజులను చూపించుకొని వారిద్దరూ ఇష్టపూర్వకంగా నచ్చిన మొత్తానికి పందెం వేస్తారు. ఎత్తుడు.. దింపుడు పందెం రెండు వర్గాల మధ్య జరుగుతుంది. పందెం మొత్తం, సంఖ్యను ముందు నిర్ణయించుకుంటారు. ఒక వర్గం వారు తమ కోడి పుంజును బరిలో దిపంగానే.. రెండో వర్గం వారు కూడా తమ పుంజును దింపుతారు. పందెంరాయుళ్లు తమకు నచ్చిన పుంజుపై పందెం కాస్తారు. మళ్లీ రెండో వర్గం వారు బరిలో దింపిన పుంజుపై మొదటి వర్గం వారు తాము ఎంచుకున్న పుంజును బరిలోకి దింపుతారు. ఇలా వరుసగా ముందు అనుకున్నన్ని పందేలు నిర్వహిస్తారు. గతంలో కోళ్లకు కత్తులుండేవి కాదు. రోజుల తరబడి కొట్లాడుకున్నాక చివరి వరకు నిలచిన పుంజు గెలిచినట్లు ప్రకటించేవారు. ఈ మధ్య కత్తియుద్ధాలే ఎక్కువగా జరుగుతున్నాయి. పందేలపై ఎకరాల కొద్దీ భూములు, లక్షలాది రూపాయల మొత్తాన్ని పణంగా పెడుతుంటారు. పందెంలో పుంజు గెలిస్తే లభించే పేరు.. ప్రఖ్యాతల కోసం ఇంకా ఎక్కువ ఖర్చు చేయడానికైనా వెనుకాడరు.

- **మాంసానికి యమ క్రేజ్..**

పరాజయం పాలై నెత్తరోడుతూ నేలరాలిన కోడిని కోసమాంసంగా పిలుస్తారు. దీనికి క్రేజ్ ఎక్కువ. కోస మాంసం ధర రూ. రెండు వేల నుంచి రూ.మూడు వేల వరకు పలుకుతుంది. అయితే కోసమాంసాన్ని అమ్మేవారు తక్కువ. ఇంటిల్లిపాది కలిసి తినడం, ఆత్మీయులకు పంపడం చేస్తుంటారు.



- **ఉమ్మడి జిల్లాలో జోరు..**

ఒకప్పుడు పందెం కోళ్ల పెంచడం.. పందేలు ఆడడం ఆంధ్రాకే పరిమితం. ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చాలాచోట్ల పందెం కోళ్లను పెంచుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పిల్లకోళ్లను ఇక్కడికి దిగుమతి చేసుకొని ఫాంలు నడుపుతున్నారు. ఆరునెలల కోడి మొదలు ఏడాది వయసున్న కోళ్లను నేరుగా.. ఆలన్‌లైన్ ద్వారా పందెం రాయుళ్లకు అమ్ముతున్నారు. అంతేకాదు.. జిల్లాలో కొన్నిచోట్ల పందేలు కాస్తున్నట్లు సమాచారం.

కోడి అ‘ధర’హో..

- పెద్దజాతి కోడిపుంజులకు కేరాఫ్ శివపల్లి
- రూ.2 వేల నుంచి రూ.15 వేలు పలుకుతున్న ధర
- ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు ఎగుమతి




శివపల్లెలో కోడిపుంజులు

ఎలిగేడు: పందెంకోడి అ‘ధర’హో అనిపిస్తోంది. మేలుజాతి కోడిపుంజులకు భలేగిరాకీ ఉంటోంది. ఒకప్పుడు కోడిపందేలకు కేరాఫ్‌గా నిలిచిన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివపల్లి గ్రామం ఇప్పుడు కోడి పుంజుల పెంపకానికి నిలయంగా మారింది. శివపల్లిలో పెద్దజాతి కోడి పుంజులు ఇంటింటా పెంచుతుండడంతో కొనుగోలు చేసేందుకు జిల్లాతో పాటు ఏపీ, మహారాష్ట్ర నుంచి కూడా వస్తున్నారు. దీంతో ఒకప్పుడు కోడి పందేలు నిర్వహించిన గ్రామానికి చెందిన వారు ఇప్పుడు మేలుజాతి కోడిపుంజులు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. మేలుజాతి కోడిపుంజు కిలోకు రూ.2వేల నుంచి రూ.10వేల వరకు పలుకుతున్నాయి. పెద్దవాటికి రూ.15వేల వరకు వెచ్చిస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన కోడిపుంజులు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు ప్రాంతాలకు తరలించి కోడి పందేలకు వినియోగిస్తారని చెబుతున్నారు.

అమృత్‌లాల్ శుక్లా సేవలు మరువలేనివి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్

సిరిసిల్ల: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ అమృత్‌లాల్ శుక్లా 33వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. తంగళ్లపల్లి మానేరు నది ఒడ్డున గల ఆయన స్తూపానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ మాట్లాడుతూ, సిరిసిల్లలో జరిగిన ఆంధ్రమహాసభ ఇచ్చిన పిలుపుమేరకు అమృత్‌లాల్ శుక్లా ప్రభావితుడై నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకుని, ఉపాధ్యాయ వృత్తిని వదులుకొని తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని ప్రధాన భూమిక పోషించారని తెలిపారు. రాజకీయ పార్టీల భ్రమలో యువత పాడవకుండా సమ సమాజకోసం పోరాటం చేసిన అమృత్‌లాల్ ఆశయ సాధనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమలో అమృత్‌లాల్ శుక్లా తనయుడు శాంతి ప్రకాస్ శుక్లా, సీపీఎం జిల్లా నాయకులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, శ్రీరామ్ సదానందం, సూరం పద్మ, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, సిరిమల్లె సత్యం, కూచన శంకర్, జెజుగం సురేశ్, దాసరి రూప, లింగంపల్లి కృష్ణవేణి, కుమ్మరికుంట కిషన్, గోవిందు లక్ష్మణ్, కంది మల్లేశం, కుడిక్యాల కనకయ్య, గోరంతుల రాజమల్లు, శ్రీనివాస్, సదానందం, గంగాధర్, రాము, వేణు, వెంకటేశం, హరిదాసు, సంపత్, కనకయ్య, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న నాయకులు

దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారు

- రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ: దేవున్ని అడ్డుపెట్టుకుని కొందరు రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం వేములవాడ రాజన్నను దర్శించుకున్న అనంతరం మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా పడాలి, రైతులు బాగుండాలన్నారు. దేవుడు కొందరికే సొంతం అని కొందరు వ్యవహరిస్తున్నారని అది సరికాదన్నారు. అయోధ్య రామాలయాన్ని విగ్రహ ప్రతిష్ఠాపన చేసి ప్రారంభం చేయాల్సి ఉండగా రాజకీయాలు, ఎన్నికల కోసం హడావుడిగా ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. తాము ప్రశ్నిస్తే హిందువులకు వ్యతిరేకం అంటున్నారని, దేవుడు కొందరి వాడు కాదు అందరి వాడు అన్నారు. నాడు రాజీవ్‌గాంధీయే రాముడి చరిత్ర వెలికి తీశారని గుర్తు చేశారు. వేములవాడ అభివృద్ధిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఆది శ్రీనివాస్, తాను తీసుకెళ్లినట్లు వివరించారు. మంత్రి వెంట వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గౌడ నిత్యాన్నదాన సత్రం పనుల్లో వేగం పెంచండి

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల సేవలో తరించేందుకు గౌడ నిత్యాన్నదాన సత్రం పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో నిర్మిస్తున్న గౌడ నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిర్మాణ పనుల కోసం ఇప్పటికే అనేకమంది దాతల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించామని తెలిపారు. కావాల్సిన సహాయ సహకారాలు అందించడానికి తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. వీలైనంత తొందరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని సంఘం నాయకులకు సూచించారు.

పండుగకు సొంతూళ్లకు..


పేదలకు దుస్తులు అందిస్తున్న సత్యం కూతుళ్లు

- దుబాయి నుంచి ఎల్లారెడ్డిపేటకు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సంక్రాంతి పండుగకు పలువురు సొంతూళ్లకు చేరుకుంటున్నారు. ముంబాయి, హైదరాబాద్, దుబాయి లాంటి ప్రాంతాల నుంచి సొంత ఊళ్లల్లో పండుగ వేడుకల్లో పాల్గొనడానికి తరలివచ్చారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన తెలంగాణ దుబాయ్ ఎమరెట్స్ అధ్యక్షుడు రాధారపు సత్యం తమ కుటుంబంతో కలిసి సంక్రాంతి వేడుకలు జరుపుకోవడానికి వచ్చారు. ఇదే గ్రామానికి చెందిన సాన గోపాల్–సౌజన్య దంపతులు హైదరాబాద్‌లో అరవింద్ ల్యాబరేటరీలో పని చేస్తూ..తమ కుటుంబంతో పండుగను జరుపుకోవడానికి ఒకరోజు ముందే గ్రామానికి చేరుకున్నారు. ఇలా వివిధ ప్రాంతాల నుంచి సొంత ఊళ్లకు చేరుకోవడంతో పల్లెల్లో పండుగ సందడి కనిపిస్తోంది. దుబాయి నుంచి ఇక్కడికి వచ్చిన సత్యం పిల్లలు శనివారం నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు.


పండుగకు ఎల్లారెడ్డిపేటకు చేరుకున్న సాన సౌజన్య, పిల్లలు

వైకల్యమున్నా.. ఉపాధి తిప్పలు

- వీల్‌చైర్‌లో కూర్చొని మటన్ విక్రయం

బోయినపల్లి(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో కాలు విరిగినా.. వీల్‌చైర్‌లో కూర్చొని భార్య సాయంతో మటన్ విక్రయిస్తున్నాడు బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన టేకు శంకర్(బబ్బిలి). శంకర్ గ్రామంలో చిన్న గుడిసెలో నివాసముంటూ మటన్ సెంటర్‌తో జీవనోపాధి పొందుతున్నాడు. కొద్ది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. రూ.లక్షలు ఖర్చు చేసి సర్జరీ చేసినా.. నయం కాలేదు. అయితే మటన్ సెంటర్‌తో ఉపాధి పొందే శంకర్ వేరే ఆధారం లేకపోవడంతో.. చివరకు వీల్‌చైర్‌లోనే కూర్చొని మటన్ విక్రయిస్తున్నాడు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా ఇలా మటన్ కొడుతూ కనిపించిన శంకర్‌ను చూసి పలువురు జీవనోపాధికి ఎంత కష్టంరా నాయనా అనుకోవడం కనిపించింది. రెండుసార్లు సర్జరీ చేసినా తన కాలు నయం కాలేదని, ప్రభుత్వం ఆదుకోవాలని శంకర్, అతడి భార్య టేకు పద్మ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


వీల్‌చైర్‌లో కూర్చొని మటన్ విక్రయిస్తున్న శంకర్

అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్

- జల్సాలకు అలవాటు పడి చోరీలు
- 7 తులాల బంగారం, రూ.31వేల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ సదన్‌కుమార్

ముస్తాబాద్(సిరిసిల్ల): జల్సాలకు అలవాటు పడ్డ ఓ యువకుడు చోరీలకు పాల్పడుతున్నాడు. తండ్రి చూపిన ఉద్యోగం వదులుకుని దొంగగా మారాడు. పలు కేసుల్లో జైలుకు వెళ్లినా బుద్ధి మారని దొంగ.. ముస్తాబాద్‌లో భారీ చోరీకి పాల్పడి పోలీసులకు చిక్కాడు. ఆదివారం సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ముస్తాబాద్‌లో ఆర్టీసీ డ్రైవర్ బిట్ల వెంకటేశ్ ఇంట్లో గత శనివారం చోరీ జరిగింది. భారీ నగదు, ఆభరణాలు అపహరణకు గురికావడంతో సవాల్‌గా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో దొంగను గుర్తించారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన అంబటి శ్రీకాంత్ (35)ను ముస్తాబాద్‌లోని ఏఎంఆర్ గార్డెన్స్ వద్ద ఆదివారం పట్టుకున్నారు. అతడి నుంచి 7 తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి, రూ.31వేల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాంత్ తండ్రి గతంలో ఆర్అండ్‌బీ శాఖలో పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. అదే పనిలో శ్రీకాంత్‌ను పెట్టినప్పటికీ అందులో ఉండలేక, కామారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్ జిల్లాల్లో పది చోరీ కేసుల్లో జైలుకు వెళ్లివచ్చాడని సీఐ తెలిపారు. ముస్తాబాద్‌లో చోరీ జరిగిన గంటల వ్యవధిలోనే దొంగను పట్టుకున్న సీఐ సదన్‌కుమార్, ఎస్సై శేఖర్‌రెడ్డి, పీసీలు చంద్రశేఖర్, దామోదర్, రాజశేఖర్, రాజ్‌కుమార్‌లను ఎస్పీ అఖిల్‌మహాజన్ అభినందించారు.


దొంగను అరెస్టు చూపుతున్న సీఐ సదన్‌కుమార్